ఉత్తుత్తి హామీలు.. ఊకదంపుడు కహానీలు

- ప్రజలకు లబ్ధి చేకూర్చడంలో కూటమి నేతల పిల్లిమొగ్గలు
- ఆడబిడ్డ నిధి ఊసే లేదు
- నిరుద్యోగ భృతి పత్తా కానరాదు
- బాబు హామీలతో మోసపోయామంటున్న మహిళలు

అల్లిపురం: కూటమి ప్రభుత్వం 15 నెలల పాలన అంతా దగా.. మోసం అంటూ దక్షిణ నియోజకవర్గ ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ అంటూ హామీలు గుప్పించి వాటిని పూర్తి స్థాయిలో నెరవేర్చకుండా ప్రజల్ని మోసం చేశారంటూ విమర్శిస్తున్నారు. యువతకు ప్రతి నెలా రూ.3 వేలు నిరుద్యోగ భృతి, ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఆర్థిక సాయం, ప్రతి ఇంటికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తామంటూ ఊదర గొట్టారు. కట్ చేస్తే అధికారం చేపట్టి 15 నెలలు పూర్తయినా ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో నెరవేర్చలేదు. గ్యాస్ సిలిండర్ల పథకం ప్రారంభించినా ఆదిలోనే హంసపాదులా ఆ పథకం తయారైంది.


సూపర్ సిక్స్ పోస్టర్

ఏడాదికి మూడు సిలిండర్లు ఏవి బాబు?

ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందజేస్తామన్న ప్రభుత్వం దాన్ని సైతం ఆటకెక్కించింది. పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించి మొదటి సిలిండర్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఊదరగొట్టింది. సగం మందికి మాత్రమే గ్యాస్ సిలిండర్ సొమ్ము వారి బ్యాంకు ఖాతాల్లో పడగా మిగిలిన వారికి ఎదురు చూపే మిగిలింది. ఏడాది పాలన పూర్తయినా ఇప్పటి వరకు ఒక్క సిలిండరుకు సంబంధించి కూడా పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరలేదు. నియోజకవర్గంలో సుమారు 86 వేల కుటుంబాలు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ ఉచిత గ్యాస్ సిలిండర్ పథకానికి 50 వేల వరకు అర్హత కలిగిన వారు ఉన్నారు. మొదటి సిలిండర్ సొమ్ము కేవలం 25 వేల లోపు లబ్ధిదారులకే పడింది.

మహిళలకు నెలకు రూ.1500 ఎప్పుడిస్తారు?

తాము అధికారంలోకి వస్తే మహిళలకు నెలకు రూ.1500 ఆర్థిక సహకారం అందిస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. అధికారం చేపట్టి ఏడాదిన్నర అయింది. ఆడబిడ్డల నిధి ఎప్పుడు ఇస్తారంటూ మహిళలు ప్రశ్నిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటే తాము ఎక్కువ మొత్తం అందిస్తామంటూ నమ్మ బలికి తీరా అధికారంలోకి వచ్చాక మొండి చేయి చూపడం బాబు నైజంగా మారిపోయిందని మహిళలు విమర్శిస్తున్నారు.


మహాశక్తి పోస్టర్

నిరుద్యోగ భృతి ఊసే లేదు..

తాము అధికారం చేపట్టిన వెంటనే నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి అందజేస్తామంటూ హడావుడి చేశారు. తీరా అధికారం చేపట్టి ఏడాదిన్నర అవుతున్నా ఇంత వరకు ఆ ఊసే ఎత్తకపోవడం కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనంగా కన్పిస్తుందని నిరుద్యోగులు విమర్శిస్తున్నారు. కొత్త ఉద్యోగాలు లేవు.. ఉన్న ఉద్యోగాలను ఊడదీస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో చదువుకుని ఉద్యోగాలు రానివారు సుమారు 55 వేల మందికి పైగా ఉన్నారు. వీరంతా ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారా అని ఎదురు చూస్తున్నారు.

హామీల అమలు ఎప్పుడు?


కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలి. మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఆడబిడ్డ నిధి ఇవ్వాలి. అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తి కావస్తున్నా ఇప్పటి వరకు ఆ ఊసే లేదు. దీనిపై కూటమి నాయకులు సమాధానం చెప్పాలి.

– కె.సత్య, బంగారమ్మమెట్ట

నమ్మించి మోసం చేశారు..


ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు సూపర్ సిక్స్ పేరిట హామీలను ఊదర గొట్టారు. తీరా గెలిచాక వాటి ఊసే లేదు. ఆడబిడ్డ నిధి పేరుతో మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్నారు. ఇప్పుడు ఆ ఊసే లేదు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని నిరుద్యోగులు, మహిళలను నమ్మించి మోసగించింది.

– డి.అమ్మాజీ, కుమ్మరివీధి

మోసగించడం చంద్రబాబుకు అలవాటే..


మహిళలను ఓటు బ్యాంకుగా వాడుకునేందుకు చంద్రబాబు మోసపూరిత హామీలు ఇవ్వడం, మహిళలు ఆయన మాటలు నమ్మి మోసపోవడం అలవాటు అయిపోయింది. ఇప్పటికైనా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలి.

– ఎల్.రామలక్ష్మి, వివేకానందకాలనీ

అన్నదానానికి వాసుపల్లి రూ.10 వేల విరాళం


రూ.10 వేల విరాళం అందజేస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్: నియోజకవర్గ పరిధి 39వ వార్డులో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించనున్న మహా అన్నదానానికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదివారం రూ.10 వేలు కమిటీ సభ్యులకు వార్డు అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా దక్షిణ నియోజకవర్గంలో భిన్నత్వంలో ఏకత్వంగా అన్ని పండగలు ఘనంగా జరుగుతాయన్నారు. ఈ ఏడాది దసరా ఉత్సవాలు కూడా దక్షిణ నియోజకవర్గంలో అంబరాన్నంటాయన్నారు. వైఎస్సార్‌సీపీ 39వ వార్డు అధ్యక్షుడు, ముస్లిం విభాగం నాయకుడు ముజీబ్‌ఖాన్ దసరా అన్నదాన కార్యక్రమంలో భాగస్వామ్యం అవుతూ ముందుకు రావడం అభినందనీయమన్నారు. పేదవాడి ఆకలి నింపే ఏ కార్యక్రమానికైనా తాను ముందుంటానని, అలాగే తనతో నడిచే వైఎస్సార్‌సీపీ దక్షిణ శ్రేణులు కూడా కలిసి నడవడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, 29వ వార్డు అధ్యక్షుడు పీతల వాసు, పార్టీ నాయకులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ గోడ నిర్మించరూ!


విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ గోడ నిర్మించాలని పూర్ణామార్కెట్‌లో వ్యాపారులు కోరుతున్నారు. ఇటీవల ఇక్కడి ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగి ట్రాన్స్‌ఫార్మర్, సమీపంలో ఉన్న బయోప్లాస్టిక్ స్టాల్ కాలి బూడిదైపోయాయి. ఆ సమయంలో వ్యాపారులు, వినియోగదారులు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. తర్వాత విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించి వెంటనే విద్యుత్ పునరుద్ధరణ కోసం వైరింగ్ ప్రారంభించారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ గోడ మాత్రం నిర్మించలేదు. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆనుకుని పూలమార్కెట్, పక్కనే పోలీసు ఔట్‌పోస్ట్, మరోపక్క వినియోగదారుల వాహనాల పార్కింగ్ స్థలం ఉన్న నేపథ్యంలో రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వ్యాపారులు, వినియోగదారులు కోరుతున్నారు.

– జగదాంబ

ఏపీ ఫిజికల్ సైన్స్ ఫోరం కోశాధికారిగా రాజారావు


ఆరిలోవ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం రాష్ట్ర శాఖ కోశాధికారిగా జిల్లాకు చెందిన పాలగుమ్మి రాజారావు నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం జిల్లాలోని పెదగంట్యాడ మండలం గంగవరం ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. విజయవాడలో శనివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా తనను ఎన్నుకున్నట్లు రాజారావు ఆదివారం తెలిపారు. జిల్లాలో ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం అధ్యక్షుడిగా పదేళ్లుగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పదవి కోసం తనను ఎన్నుకోవడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో 26 జిల్లాల కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు మేలు కలిగేలా ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం పనిచేస్తుందని తెలిపారు. ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుల సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

కాంగ్రెస్ సంతకాల సేకరణ


సంతకాల సేకరణలో కాంగ్రెస్ నాయకులు

మద్దిలపాలెం : ఏఐసీసీ పిలుపు మేరకు ఓట్ చోర్-గద్దె చోడ్ నినాదాలు చేస్తూ కాంగ్రెస్ నాయకులు సంతకాలు సేకరించారు. బీజేపీ, కేంద్ర ఎన్నికల సంఘం కలిసి చేస్తున్న కుట్రలను పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రియాంక దండి, నాయకులు ఈగల మోహన్ సాయి, వంటాకు వినోద్ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కృష్ణ కాలేజీ రోడ్డులో ప్రజలకు ఆది వారం వివరించారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ దేశంలో ఈసీ సహాయంతో బీజేపీ అధికారంలోకి వస్తోందని ఆరోపించా రు. కార్యక్రమంలో కాండవ గాయత్రి, మహమ్మద్ ఆలీ, వేమూరి సురేష్, గుర్రం కనకరాజు, మామిడి వరాలమ్మ, భోగవరపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేంకటాద్రిపై ప్రత్యేక పూజలు


నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెందుర్తి: చాతుర్మాస్య దీక్షలో భాగంగా స్థానిక వేంకటాద్రిపై ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో సుందరకాండ హవనం చేశారు. అనంతరం శ్రీనివాస నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. ముందుగా స్వామివారికి గోత్రనామార్చనలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా జరిపారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర పూజ చేశారు. దాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

రౌడీషీటర్ల ఇళ్లలో ఆకస్మిక తనిఖీలు


రౌడీషీటర్ల ఇళ్లను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్న సీఐ జీడీ బాబు

దాబాగార్డెన్స్: వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పలువురు రౌడీషీటర్ల ఇళ్లపై అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్టు సీఐ జీడీ బాబు తెలిపారు. రౌడీ షీటర్లు తమ ఇళ్లు, ఇతర స్థలాల్లో గంజాయి, మత్తు పదార్థాలు, శాంతి భద్రతలకు భంగం కలిగించే ఇతర వస్తువులు దాచి ఉన్నట్టయితే తక్షణం పట్టుబడేలా నేర నియంత్రణ కోసం అవసరమైన చర్యలు తీసుకోవడమే ఆకస్మిక తనిఖీల ఉద్దేశమన్నారు. ఐదు బృందాలుగా స్టేషన్ పరిధి పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టామన్నారు. ముందస్తు నేర నివారణ చర్యల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు భద్రత కల్పించడమే లక్ష్యమని, రౌడీషీటర్ల కుటుంబాల పరిస్థితుల గురించి అక్కడి నుంచే సమగ్ర సమాచారం తీసుకుని అవసరమైన సహాయం అందించనున్నట్లు తెలిపారు. రౌడీషీట్ ఉన్న వ్యక్తులు శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రౌడీషీటర్లకు క్లాస్..

వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పలువురు రౌడీ షీటర్లతో సీఐ జీడీ బాబు ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇప్పటికే రౌడీషీట్ ఓపెన్ అయినందున సమాజంలో జాగ్రత్తగా, సద్భావనతో ప్రవర్తించాల్సిన అవసరాన్ని సూచించారు. ఇక నుంచి మంచి ప్రవర్తన కలిగి ఉంటే ఉన్నతాధికారుల సూచనల మేరకు రౌడీషీట్ మూసివేయడానికి చర్యలు తీసుకోవచ్చని హితవు పలికారు. ఉపాధి అవకాశాలు కావాలనుకునే వారికి పోలీస్ డిపార్టుమెంట్ ద్వారా సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు.

రోడ్డు మధ్యలో డస్ట్‌బిన్‌తో ఇక్కట్లు


జీవీఎంసీ 35వ వార్డు బౌడారారోడ్డులో ఉన్న ఓ డస్ట్‌బిన్ ట్రాఫిక్ జామ్‌కు కారణమవుతోంది. మార్కెట్‌కు వచ్చే వాహనాలకు అడ్డంకిగా నిలుస్తోంది. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది ఇక్కడి చెత్తను వాహనంలో తరలించేందుకు వీలుగా ఈ డస్ట్‌బిన్‌ను ఇలా రోడ్డు మధ్యలో వదిలేసినట్లు ఇక్కడి చిరు వ్యాపారులు వాపోతున్నారు. చెత్త తరలింపు అయిపోయిన తర్వాత డస్ట్‌బిన్‌ను రహదారిలో ఓ మూలకు జరిపి పెడితే బాగుంటుందని వ్యాపారులు, వినియోగదారులు చెబుతున్నారు.

– జగదాంబ

వాకర్స్ క్లబ్ సేవా కార్యక్రమాలకు సహకారం

మురళీనగర్: వాకర్స్ క్లబ్ నిర్వహించే సేవా కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తానని వాకర్స్ డిస్ట్రిక్ట్–101 పూర్వ గవర్నర్ కె.వెంకటరాజు తెలిపారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో ఆదివారం నిర్వహించిన క్లబ్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభ్యులు సమన్వయంగా పనిచేస్తూ నడక, ఆరోగ్య పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ మాట్లాడుతూ సభ్యుల ఆరోగ్యంతోపాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రతి నెలా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వాకర్స్ వాయిస్ పత్రికను ఆవిష్కరించారు. ఈ నెలలో పుట్టిన రోజు చేసుకుంటున్న సభ్యులకు చిరు కానుకలు అందించారు. వెంకటరాజుతోపాటు వాకర్ పొందూరు సూర్యనారాయణను సత్కరించారు. పార్కు అభివృద్ధికి తన వంతుగా రూ.5 వేలు విరాళంగా ఇస్తున్నట్లు సూర్యనారాయణ ప్రకటించారు. పుట్టిన రోజు జరుపుకుంటున్న సభ్యులు క్లబ్‌కు విరాళాలు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షురాలు జి.విజయలక్ష్మి, కార్యదర్శి సీహెచ్‌ఎస్ఎస్‌వీ ప్రసాదరావు, సహ కార్యదర్శి ఎస్.ప్రకాశరావు, కోశాధికారి ఆర్.నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు ఎ.వీరబాబు, పి.గిరిధర్, జి.రామకృష్ణ, వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి, ఓం వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ప్రమీల పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు


చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న సినీ నటుడు రవితేజ, నిర్వాహకులు


ప్రదర్శన ఇస్తున్న బాలికలు


బహుమతులు అందుకుంటున్న నాట్యదీపిక కూచిపూడి అకాడమీ చిన్నారుల తల్లిదండ్రులు

దాబాగార్డెన్స్: జగన్నాథ కళా సంక్షేమ సేవా సమాజం స్వర్ణోత్సవాల్లో భాగంగా ఆదివారం నగరంలోని ప్రేమసమాజం ఆడిటోరియంలో నిర్వహించిన నృత్య పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. పోటీలకు నగరం నుంచే కాక ఇతర జిల్లాల నుంచి డ్యాన్స్ అకాడమీలు పాల్గొన్నాయి. బ్యాడ్ బాయ్స్ ఎంటర్‌టైనర్స్, అన్నమ్మ చారిటబుల్ ట్రస్ట్, నృత్య భారతి, అభినయ ప్రియ, నవ చైతన్య, నాట్య దీపిక కూచిపూడి అకాడమీ, యారాడ జెడ్పీ హైస్కూల్, ఏయూ (వేద గాయత్రి), శివ క్లాసికల్, ముద్రా డ్యాన్స్ ఇనిస్టిట్యూట్, శాంతినికేతన్ స్కూల్, నవ చైతన్య కళా నాట్య సంఘం, కిరణ్మయి నృత్యాలయ, శ్రీ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ, హరి హర నృత్యనికేతన్, లయన్స్ క్లబ్‌తో పాటు వివిధ పాఠశాలలు, డ్యాన్స్ అకాడమీల నుంచి పలువురు చిన్నారులు పాల్గొని తమ ప్రతిభ ప్రదర్శించారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసపత్రాలు అందజేశారు. సాయంత్రం నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

నేత్రపర్వంగా నిత్య కల్యాణం


స్వామి వారికి కల్యాణం చేస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామి నిత్య కల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు స్వామి వారి అంతరాలయ దర్శనం, వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదం అందజేశారు.

ఘనంగా ఆర్యవైశ్య యువజన సంఘం వార్షికోత్సవం


మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు

దాబాగార్డెన్స్: ఆర్యవైశ్య యువజన సంఘం 53వ వార్షికోత్సవం ఆదివారం పాతనగరంలోని వాసవీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వార్షికోత్స సభలో సంఘం అధ్యక్షుడు నేతి శ్రీనివాసరావు సంఘం ఆవిర్భావం గురించి తెలిపారు. ఆర్యవైశ్యుల సంస్కృతీ సాంప్రదాయాలను ముందుకు తీసుకెళ్లే ఉద్దేశంతో వివిధ కార్యక్రమాలు చేపట్టడం, మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి చేయడం ధ్యేయమన్నారు. కందుల రామారావు సారథ్యంలో ప్రారంభించబడిన సంఘం 53వ వార్షికోత్సవం జరుపుకోవడం సంతోషకరమన్నారు. కార్యదర్శి కట్టమూరి సూర్యనారాయణ వార్షిక నివేదిక అందజేసి ఏడాది కాలంలో చేపట్టిన సేవా కార్యక్రమాలను వివరించారు. ఆర్య వైశ్య ప్రతినిధి గ్రంధి రాజేష్ మాట్లాడుతూ 53 ఏళ్ల కిందట అప్పటి పెద్దలు ముందు చూపుతో ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య యువజన సంఘం నానాటికీ అభివృద్ధి చెందుతూ ఎంతో మంది నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించి, వారి ఉన్నత చదువులకు చేయూతనివ్వడం, మహిళలకు ఆర్థిక స్వావలంబన చేకూరేలా కృషి చేయడం ముదావహమన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ చైర్మన్ వంకాయల జవహర్, కోశాధికారి దుర్గా నూకేశ్వరరావు, కన్యకాపరమేశ్వరి దేవస్థాన సంఘ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం మాజీ సభ్యుడు విన్నకోట రామ్మూర్తి, వాసవీ కల్యాణ మండప సంఘం కార్యదర్శి నున్న గోపాల్, కల్లూరి సత్తిబాబు, కొత్త అరుణ్‌కుమార్, సన్యాసిశెట్టి, అధిక సంఖ్యలో ఆర్యవైశ్యులు తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరణ


కోటి సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ ఇంటలెక్చువల్ విభాగం ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, నిర్మాణానికి మద్దతుగా వైఎస్సార్‌సీపీ జిల్లా ఇంటలెక్చువల్ విభాగం కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించింది. వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సంస్థ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఇంటలెక్చువల్ విభాగం అధ్యక్షుడు దేవరకొండ మార్కండేయులు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేసిందని గుర్తు చేశారు. ప్రధానంగా విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యమిచ్చారన్నారు. కోవిడ్ లాంటి విపత్తుల సమయంలో ప్రజలకు మెరుగైన వైద్యం అందాలనే సంకల్పంతో 17 మెడికల్ కళాశాలను రాష్ట్రంలో నిర్మించేందుకు అప్పటి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బాటలు వేశారన్నారు. అయితే ఆ మెడికల్ కళాశాలల నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. ఇది రాష్ట్ర ప్రజల ప్రజారోగ్యాన్ని తాకట్టు పెట్టడమే అవుతుందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ ఉద్యమాన్ని జిల్లా ఇంటలెక్చువల్ విభాగం బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తుందన్నారు. ఈ అంశంపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల మద్దతు కూడగట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విభాగం అధ్యక్షుడు పిల్లా అప్పారావు, ప్రధాన కార్యదర్శి జేవీజీ సురేష్, ఉత్తరం కార్యదర్శి జి.రాధాకృష్ణ, ఏయూ విద్యార్థి నాయకుడు మోహన్, దక్షిణం నాయకుడు జాఫర్ అలీ, దక్షిణం కార్యదర్శి విజయబాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా మద్యం వ్యాపారం


బౌడారా రోడ్డు మనోరమ థియేటర్ ప్రాంతంలో బహిరంగంగా మద్యం బాటిళ్లతో తిరుగుతున్న యువకులు

నగరంలో మద్యం వ్యాపారం విచ్చలవిడిగా సాగుతోంది. బడి.. గుడి.. నడిరోడ్డు.. జనావాసాలు అనే తేడా లేకుండా.. నిబంధనలతో అసలు పని లేకుండా మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పగలు, రాత్రి.. వేళాపాళా లేకుండా మందుబాబులు మద్యం కొనుగోలు చేస్తూ.. బహిరంగంగా తాగి తూగుతూ నానా రభస చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో మద్యం ఏరులై పారుతోంది. మద్యానికి బానిసైన కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



ఐటీఐ జంక్షన్ వద్ద వైన్ షాపు మేడ పైన బహిరంగంగా మద్యం తాగుతున్న మందుబాబులు


మధురానగర్ రోడ్డులోని స్కూల్‌ను ఆనుకొని నిర్వహిస్తున్న వైన్ షాప్